పంట కాలువల్లో పూడికలు

- పేరుకుపోయిన మట్టి దిబ్బలు
- నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్న వైనం
- వ్యర్థాలతో డంపింగ్ యార్డులను తలపిస్తున్న కాలువలు
- ఆధునీకరణను పట్టించుకోని అధికారులు



రావులపాడు వద్ద అమలాపురం బ్యాంక్ కెనాల్‌లో పేరుకుపోయిన మట్టి, తూడు దిబ్బలు



అమలాపురం బ్యాంక్ కెనాల్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలు, మట్టి దిబ్బలు

రావులపాలెం: డెల్టా ప్రజలకు ఆరాధ్యుడైన సర్ ఆర్థర్ కాటన్ మహాశయుడి కృషితో తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని భూముల్లో మూడు పంటలు పండేలా శివారు ప్రాంతాలకు సైతం ప్రతి ఎకరానికి సాగునీరు అందేలా పక్కా ప్రణాళికతో కాలువలు నిర్మించారు. ఆ మహాశయుని కృషి ఫలితంగా నేడు లక్షలాది ఎకరాల్లో మూడు పంటలు పండుతున్నాయి. అయితే ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న సాగునీటిని ఆనకట్టల ద్వారా నీటిని నిల్వ చేసి అక్కడి నుంచి శివారు ప్రాంతాల ప్రజలకు తాగునీరు, వ్యవసాయ అవసరాలకు పంపిణీ చేసే కాలువలు నేడు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. కాలువల్లో ఎక్కడ చూసినా మట్టి దిబ్బలే దర్శనమిస్తున్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న నీటిలో చెత్త, చెదారం, మట్టి కలిసిపోయి నీటి ప్రవాహాన్ని నియంత్రించే చెక్ డ్యామ్‌ల వద్ద మట్టి టన్నుల కొద్దీ పేరుకుపోతోంది. ఇలా పేరుకుపోయిన మట్టి కారణంగా శివారు ప్రాంతాలకు సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. దీంతో నీటి ప్రవాహం తగ్గిపోయి శివారు ప్రాంతాలకు నీటి ఎద్దడి చోటు చేసుకుంటోంది.

చెక్ డ్యామ్‌ల వద్ద పరిస్థితి మరీ అధ్వానం

చెక్ డ్యామ్‌ల వద్ద కొండలా పేరుకుపోయిన మట్టి దిబ్బలను తొలగించకుండా ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాలువలపై విధులు నిర్వర్తించే లస్కర్లు చెత్త చెదారాన్ని తొలగించడంలో విఫలమవుతున్నారు. కాలువల్లో అడ్డుకట్టలు, నీటి ప్రవాహానికి ఏర్పడిన మట్టి దిబ్బలు, భారీగా పేరుకుపోయిన పూడికను తొలగించకపోవడంతో శివారు ప్రాంతాలకు నీరు చేరడం గగనంగా మారింది. రావులపాలెం మండలంలోని ముక్తేశ్వరం, అమలాపురం, గన్నవరం మూడు ప్రధాన బ్యాంక్ కాలువల ద్వారా చిన్న కాలువలు, బోదెల గుండా పంటలకు సాగు నీరు చేరుతుంది. ప్రధాన కాలువల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, కాలువ గట్లు ఆక్రమణలో కాలువ కుచించుకుపోవడం నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. ముఖ్యంగా ముక్తేశ్వరం బ్యాంక్ కాలువను మెర్లపాలెం నుంచి ఊబలంక మీదుగా రావులపాలెం చివరి వరకూ గట్టు ఆక్రమణల కారణంగా నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుంది. అలాగే లొల్ల హైలెవెన్ చానల్‌లో కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు, తూడుతో పూడుకుపోయి నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుంది. ఉపాధి పథకం ఆచరణలోకి వచ్చిన తర్వాత ప్రధాన కాలువలు, సబ్ కెనాల్స్‌ను ఆధునీకరించడం అధికారులు పూర్తిగా మరిచిపోయారు.

దశాబ్ద కాలంగా ఆధునీకరణ లేదు

కొత్తపేట నియోజకవర్గంలో ప్రధాన మండలాలైన



పూరేటివారి చెరువు బోదెకు నీరు వెళ్లే చెక్ డ్యామ్ వద్ద పేరుకుపోయిన మట్టి మేటలు

ఆత్రేయపురం, రావులపాలెం, కొత్తపేట, ఆలమూరు మండలాల్లోని ప్రధాన కాలువలను దశాబ్ద కాలంగా ఆధునీకరణకు నోచుకోలేదు. భారీ వర్షాలకు ముంపు ఏర్పడితే మాత్రం కాలువలో గుర్రపుడెక్క, తూటు తొలగించి ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. కాలువల పొడవునా ఆక్రమణలు, వంతెనలు వెలుస్తున్నాయి. ఏ ఒక్క అధికారి ఇది ఏంటని ప్రశ్నించరు. ఆక్రమణలతో కాలువలు మూసుకుపోయినా పట్టించుకోరు. ఇక ఆక్రమణదారులు వారి ఇష్టానుసారంగా కాలువలను ఆక్రమించుకుని భవనాలు, షాపులు, ఇళ్లు నిర్మిస్తున్నారని శివారు ప్రాంత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కాలువల్లో పేరుకుపోయిన మట్టి దిబ్బలను, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, కాలువల పొడవునా ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.

కాలువల నిండా ప్లాస్టిక్ వ్యర్థాలే



కాలువల్లో అడుగు పెట్టలేనంతంగా సీసాలు, ప్లాస్టిక్ వస్తువులు దర్శనమిస్తున్నాయి. ఇవి మట్టిలో కూరుకుపోతున్నాయి. కాలువల్లో పూడిక భారీగా పేరుకుపోయింది. దీని వల్ల శివారు పంట పొలాలకు సాగునీరు చేరడం లేదు. కాలువల పొడవునా విపరీతంగా ఆక్రమణలు పెరిగిపోయాయి. ఆక్రమణలు తొలగించి కాలువలను విస్తరిస్తే శివారు ప్రాంతాలకు పూర్తి స్థాయిలో సాగు నీరు చేరుతుంది.

– గొలుగూరి సత్యనారాయణరెడ్డి, రైతు, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకుడు, రావులపాలెం

క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

కొత్తపేట: స్థానిక ఎస్ఎస్ 33/11 కేవీ విద్యుత్ లైన్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త బ్రేకర్ ఇన్‌స్టలేషన్ నిమిత్తం మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ కె.రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపేట పంచాయతీ పరిధిలోని ఐండారుపేట, చినమెరక, పెదమెరక, మద్దులమెరక, పనసలదొడ్డి, చిన్నగుళ్లపాలెం, పెద్దగుళ్లపాలెం, బోడిపాలెం, ఏనుగులమహల్ ప్రాంతాలకు, వాడపాలెం, మందపల్లి, ఖండ్రిగ, అవిడి, పలివెల, గంటి, కేదార్లంక, వానపల్లి, కపిలేశ్వరపురం పంచాయతీ శివారు నారాయణలంక గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సందడి చేసిన పూర్వ విద్యార్థులు



2005-06 బ్యాచ్ విద్యార్థులు

మామిడికుదురు: మొగలికుదురు ఎంపీయూపీ స్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం జరిగింది. 2005–06లో ఏడో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. నాటి చిలిపి సంఘటనలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. తమకు విద్య నేర్పిన గురువులు వీరభద్రరావు, అమ్మిరాజు, అబ్రహం, అంజిబాబు, పెద్దిరాజును ఘనంగా సన్మానించారు. అందరూ కలసి సహపంక్తి భోజనాలు చేశారు. ఆత్మీయతలు పంచుకున్నారు. తమలో పేదరికంలో ఉన్న సహచరులకు అండగా నిలవాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమం ఆద్యంతం కన్నుల పండువలా జరిగింది.

భారీ అన్న సమారాధన

మామిడికుదురు: గ్రామ పరిధిలోని కంచివారిపాలెం హనుమజ్జయంతి కార్యక్రమాల్లో భాగంగా సోమవారం భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ నెల 22 నుంచి హనుమజ్జయంతి వేడుకలను అత్యంత వైభవంగా జరిపించారు. దీనిలో భాగంగా పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాల ముగింపులో భాగంగా భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు.

అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ

అయినవిల్లి: మండలంలోని నేదునూరు శివారు శిరసవల్లి సావరంలో కొలువైన కొమారి అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను సోమవారం గ్రామ కమిటీ సభ్యులు ప్రారంభించారు. అమ్మవారి విగ్రహానికి వేదపండితులు విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్త దంపతులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అన్న సమారాధన జరిపారు.

స్వామివారి గ్రామోత్సవం

సఖినేటిపల్లి: మోరి శేషణ్ణరాయుడు కాల్వగట్టు ప్రాంతంలో కొలువైన ప్రసన్నాంజనేయ స్వామివారి గ్రామోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి వేడుకలు పురస్కరించుకుని స్వామిని పల్లకీలో ఆశీనులు చేసి, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులతో పల్లకిలో ఊరేగించారు. స్వామికి ఇంటింటా భక్తులు కొబ్బరికాయలు, అరటి పళ్లు నైవేద్యాలుగా సమర్పించారు. కాగా ఉదయం స్వామి వారికి అర్చకుడు సతీష్ నేతృత్వంలో భక్తులు పంచామృతాలతో విశేష అభిషేకం నిర్వహించారు.

తాగడానికి నీళ్లు లేవంటూ కలెక్టరేట్ వద్ద నిరసన

అమలాపురం రూరల్: తాగడానికి నీళ్లు లేవంటూ రాజోలు మండలం తాటిపాక గ్రామం ఉల్లంపర్తి వారి పేటకు చెందిన మహిళలు అమలాపురం కలెక్టరేట్ వద్ద బిందెలతో సోమవారం నిరసన తెలిపారు. ఇళ్ల వద్ద ఉన్న బోర్ల నుంచి ఉప్పు నీరు వస్తోందని, ఆ నీటిపై ఆయిల్ పొర కనిపిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బోరు నీరు తాగడానికి ఉపయోగపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తాగటానికి మంచి నీరు లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇంటింటి కుళాయి పథకంలో అధికారులు ఉల్లంపర్తి వారి పేటను విస్మరించారని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కనపాల చంటిబాబు, కనపాల ప్రసాద్‌రావు, చిన్నిబాబు, సరేష్‌బాబు, సుధాకర్ పాల్గొన్నారు.

రత్నకుమారి మృతికి సంతాపం



రాజోలు: బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ సూపరింటెండెంట్ మేడిది రత్నకుమారి (60) మృతికి సోమవారం పలువురు సంతాపం వ్యక్తం చేశారు. ఈ నెల 23న కడలి గ్రామంలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. భర్త మేడిది రాజారావు, కుమారులు శ్రీరాములు, దొర ప్రసాద్, కుమార్తె శిరీష ఉన్నారు. ఆమె మృతికి మాజీ డిప్యూటీ స్పీకర్ ఏవీ సూర్యనారాయణరాజు, తాటికోన సర్పంచ్ గోసంగి స్టాలిన్, మాజీ ఎంపీటీసీ గోసంగి పల్లయ్య తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

ధాన్యం లోడు ట్రాక్టర్ బోల్తా



సిరిపల్లి శవాల వంతెన వద్ద ధాన్యం లోడుతో బోల్తా కొట్టిన ట్రాక్టర్

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి శవాల వంతెన వద్ద ఎదురుగా వస్తున్న లారీని ధాన్యంలో లోడుతో వస్తున్న ట్రాక్టర్ తప్పించబోయి సమీప పంటకాలువలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, దాని పై కూలీలు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ధాన్యం లోడు మాత్రం పూర్తి తడిచి ముద్దయింది. ఇందులో 30 ధాన్యం బస్తాలు కుట్లు ఊడిపోవడంతో కాలువమట్టిలో కలిసింది. దీనిపై తమకు ఏ విధమైన సమాచారం అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్: మరొకరిపై కేసు



ఆలమూరులో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో సారాతో పట్టుబడ్డ నిందితులతో పోలీసులు

ఆలమూరు: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో పరిధిలోని మండపేట మండలంలోని కేశవరంలో అక్రమంగా సారా విక్రయిస్తున్న జి.అప్పలస్వామి అరెస్ట్ జరిగింది. ఎక్సైజ్ సీఐ ఐడీ నాగేశ్వరరావు కథనం ప్రకారం గ్రామ శివారు ప్రాంతంలో సారాను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఆలమూరు ఎక్సైజ్ పోలీసుల బృందం దాడులు నిర్వహించింది. ఈ దాడిలో నిందితుడు అప్పలస్వామిని అరెస్ట్ చేసి అతని వద్ద 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అలాగే సారా సరఫరా చేస్తున్న రాజానగరం మండలం పాత తుంగపాడుకు చెందిన అత్తిలి ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేసి మంగళవారం కోర్టులో హాజరు పర్చనున్నట్లు సీఐ నాగేశ్వరరావు తెలిపారు. మద్యం షాపులు నిబంధనలకు అనుగుణంగా సమయపాలన పాటించకున్నా, అధిక ధరలకు మద్యాన్ని విక్రయించినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సారాతో పలుమార్లు పట్టుబడిన నిందితులకు పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. ఆలమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ నెలాఖరు వరకూ 30 కేసులు నమోదు చేసి 19 మంది అరెస్టు చేశామన్నారు, అలాగే వారి వద్ద నుంచి మొత్తం 290 లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 5700 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆలమూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకూ అధిక కేసులు ఉన్న 54 మంది పాత ముద్దాయిలను తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు వద్ద హాజరు పరచి రూ.లక్ష పూచీకత్తుతో బైండోవర్ చేయించామన్నారు. బైండోవర్ చేసిన తర్వాత కూడా మళ్లీ పదే పదే నేరాలకు పాల్పడిన 13 మందికి విధించిన అపరాధ రుసుం ద్వారా ఎక్సైజ్ శాఖకు రూ.3.95 లక్షల ఆదాయం లభించినట్లు సీఐ నాగేశ్వరరావు పేర్కొన్నారు.

నేడు తాటమ్మ అమ్మవారి తీర్థం



పి.గన్నవరంలో వేంచేసిన తాటమ్మ అమ్మవారు

పి.గన్నవరం: గ్రామంలో వేంచేసిన తాటమ్మ తల్లి తీర్థ మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తీర్థ మహోత్సవాల్లో భాగంగా ఈనెల 6న అమ్మవారిని నిలబెట్టారు. అప్పటి నుంచి గ్రామస్తులు అమ్మవారికి రోజూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం పిల్లల సేవ, ఆదివారం చిన్న జాగరం, సోమవారం పెద జాగరాలు కన్నులపండువగా జరిగాయి. సోమవారం రాత్రి అమ్మవారి ఆలయం వద్ద చిన్నారులు, మహిళలు కాగడాలు వెలిగించి, అమ్మవారికి పూజలు చేశారు. మంగళవారం అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్నీ సిద్ధం చేసినట్టు ఆలయ ట్రస్టీ సుంకర సత్యసాయిబాబు (రాంబాబు) తెలిపారు.

మహాలక్ష్మమ్మకు నైవేద్యాల చెల్లింపు

మామిడికుదురు: పెదపట్నంలంక గ్రామ దేవత మహాలక్ష్మమ్మ జాతరలో భాగంగా సోమవారం భక్తులు అమ్మవారికి నైవేద్యాలు చెల్లించారు. ముడుపులు, మొక్కులు సమర్పించారు. జాతరలో భాగంగా పలు రకాల పుష్పాలతో అమ్మవారి ఆలయాన్ని దేదీప్యమానంగా అలంకరించారు. ఆదివారం రాత్రి జరిగిన జాతరలో పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మ వారికి పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించారు. ఆలయ కమిటీ ఎమ్మెల్యే సత్యనారాయణను ఘనంగా సత్కరించింది. ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య, కూటమి నేతలు ఆయన వెంట ఉన్నారు.

అంతర్వేది ఆలయంలో యోగా కార్యక్రమాల ఏర్పాటు



సఖినేటిపల్లి మండల పరిషత్ కార్యాలయంలో యోగాపై శిక్షణ ఇస్తున్న మన్నె సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో రానున్న అంతర్జాతీయ యోగా డే పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాలపై మూడు రోజులు యోగా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనుభవం కలిగిన యోగా నిపుణులతో ఈ నెల 27న, వచ్చే నెల 3, 16 తేదీల్లో వీటిని ఏర్పాటు చేశామన్నారు. యోగా కార్యక్రమాల పట్ల ఆసక్తి ఉన్న వారు విధిగా పాల్గొనాలని ఆయన కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కె.సూర్య నారాయణ ఆధ్వర్యంలో యోగాంధ్రా 2025లో ప్రభుత్వ ఆదేశాలపై యోగా గురువు మన్నె సత్యనారాయణ యోగాపై ఉద్యోగస్తులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. రానున్న ఇంటర్నేషనల్ యోగా డే పురస్కరించుకుని శిక్షణలో మెళకువలు ఆయన నేర్పారు. ఎంపీడీఓ, ఏఓ నరసింహారావు, పరిషత్ సిబ్బంది, ఇంజినీరింగ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులను చేయొద్దు



ఎండీయూ వాహనాల రద్దు ప్రకటన విరమించుకోవాలంటూ ఆందోళన చేస్తున్న ఆపరేటర్లు

ఆలమూరు: మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ఆపరేటర్లను నిరుద్యోగులను చేయొద్దని మండల శాఖ సోమవారం ఆందోళన నిర్వహించింది. మండలంలోని పెదపళ్లలో ఎండీయూ ఆపరేటర్లకు ప్రభుత్వం సత్వర న్యాయం చేయాలంటూ భారీ ర్యాలీ నిర్వహించారు. గత ఐదేళ్లుగా ఎటువంటి అవినీతి ఆరోపణలు లేకుండా ఇంటింటికీ రేషన్ సరకులను పంపిణీ చేసి ప్రజల మన్ననలు అందుకున్న ఎండీయూ వాహనాలపై ప్రభుత్వం కక్ష సాధింపు తగదని హితవు పలికారు. ఎండీయూ వాహనాల రద్దు ప్రకటనపై ప్రభుత్వం పునరాలోచించకపోతే తమ ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కిసాన్ మోర్చా బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు కుమారస్వామి

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరం ఎదురుబిడియం వద్ద విళ్ళ రిసార్ట్‌లో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా కార్యవర్గ సమావేశం సోమవారం జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు విళ్ళ దొరబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు చిగురుపాటి కుమారస్వామి, జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు నల్లా పవన్ కుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలకపాటి రవిరాజు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు. చిగురుపాటి కుమారస్వామి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో కిసాన్ మోర్చా కమిటీలు వేసి కిసాన్ మోర్చాను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పి.గన్నవరం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి గుత్రాల సత్యనారాయణ, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శులు గనిశెట్టి వెంకటేశ్వరరావు, ఆకుమర్తి బేబీ రాణి, యనమదల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిని అభివృద్ధి చేయండి

అంబాజీపేట: ఇసుకపూడి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారి శిథిలమై అధ్వానంగా ఉంది దానిని అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ రహదారిలో గుంతలు ఏర్పడి నడిచేందుకు వీలు లేకుండా ప్రమాద భరితంగా మారింది. కొద్దిపాటి వర్షానికే రహదారి చిత్తడిగా మారడంతో అటుగా వెళ్లే పాఠశాల విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, రైతులు నానాఅవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డులో ద్విచక్ర, సైక్లిస్టులు ప్రయాణించి ప్రమాదాల బారిన పడ్డారన్నారు. రహదారిని అభివృద్ధి చేస్తామని నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చి గాలికొదిలేశారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామానికి వచ్చే ప్రధాన రహదారిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.



ఇసుకపూడిలో అధ్వానంగా ఉన్న ప్రధాన రహదారి

మురుగు కాలువ అభివృద్ధికి దాత సాయం



పెనికేరులో మురుగుకాలువ పూడితతీత పనులు చేయిస్తున్న రైతులు

ఆలమూరు: మండలంలోని జొన్నాడ నుంచి పెనికేరు మీదుగా ప్రవహించే మురుగు కాలువ పూడికతీత అభివృద్ధి పనులు సోమవారం పూర్తయ్యాయి. ఖరీఫ్ సీజన్‌లో తమ పొలాలు ముంపునకు గురికాకూడదనే ఉద్దేశంతో పెనికేరుకు చెందిన రైతులు మురుగుకాలువ అభివృద్ధి చేయాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా దీనిపై స్పందించిన గ్రామానికి చెందిన దాత ఈదల శ్రీరామచంద్రమూర్తి (చినబాబు) స్పందించి రూ.నాలుగు లక్షలు సమకూర్చడంతో రైతులు మురుగు కాలువను రెండు కిలోమీటర్ల మేర యంత్రాల సాయంతో పూడికను తొలగించి వర్షపు ముంపు నీరు బయటకు వెళ్లే విధంగా శుభ్రం చేసుకున్నారు. దాతను పలువురు రైతులు అభినందించారు.

డెడ్‌బాడీ ఫ్రీజర్‌బాక్స్ అందజేత

అయినవిల్లి: మండలంలోని ముక్తేశ్వరానికి చెందిన అంబటి రామకృష్ణ బ్రహ్మానందరావు, అంబటి కమల జ్ఞాపకార్థం వారి కుమారుడు అంబటి మురళీమోహన్ డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను మాలమహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి కొంకి వెంకట్రావుకు సోమవారం అందజేశారు. దీని విలువ మార్కెట్‌లో రూ.70 వేలు ఉంటుదన్నారు. అన్ని కులాలకు చెందిన నిరుపేదలకు ఉపయోగపడేలా మెయింటినెన్స్ చార్జీలు తీసుకొని డెడ్‌బాడీ ఫ్రీజర్ బాక్స్‌ను అందించాలని వెంకట్రావును మురళీమోహన్ కోరారు.

25 ఏళ్లుగా రోడ్డు, డ్రైనేజీలు లేవు



అంబాజీపేటలో స్పందనలో దరఖాస్తు చేసుకుంటున్న కాలనీ వాసులు

అంబాజీపేట: మాచవరం శివారు మెట్ల రాంజీ కాలనీ ఏర్పడి 25 ఏళ్లు గడుస్తున్నా నేటికి సరైన రోడ్డు, డ్రైనేజీలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో స్థానికులు సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కొద్దిపాటి వర్షానికే రహదారులు బురదమయంగా మారిపోయి నడిచేందుకు వీలు లేకుండా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు డ్రైనేజీలు లేక అవస్థలు పడుతున్నామని అధికారులకు వివరించారు. గృహాలు నిర్మించుకుందామన్నా గృహోపకర వస్తువులు తీసుకువచ్చేందుకు రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని సీహెచ్ కరుణాకర్, సిర్రా హరిబాబు, తొత్తరమూడి రాజుకుమార్, చేట్ల సత్తిబాబు, ఈతకోట సురేష్, గుమ్మడి ఏసు, మంద వాసులు కోరుతున్నారు.

ఉపాధి మేట్లకు సౌకర్యాలు పెంచాలి



మోరిపోడులో మేట్స్, కూలీలతో సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సఖినేటిపల్లి: ఉపాధి పథకంలో చోటు చేసుకున్న మార్పులకు అనుగుణంగా మేట్లకు పెరిగిన అదనపు బాధ్యతలకు తగ్గట్టుగా వారికి సౌకర్యాలు పెంచాలని ఉపాధి కూలీల సంఘ జిల్లా అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మోరిపోడులో మేట్ కడలి లక్ష్మి అధ్యక్షతన సదరు మేట్స్, కూలీల సమస్యలపై ఆయన సమావేశం నిర్వహించారు. శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ, పథకంలో కూలీల మస్టర్ తీసుకోవడంలో నేషనల్ ఇన్ఫర్మేటిక్ సిస్టం వచ్చాక రెండు పూటలా మేట్స్‌కు మస్టర్లు తీసుకోవాల్సి వస్తోందన్నారు. పనుల వద్ద కొలతలు అప్పగించడం, పనులు సరిగా జరిగాయా లేదో చూడడం వంటి అదనపు బాధ్యతలు మేట్స్ చేస్తున్నారన్నారు. ఈ రీత్యా మేట్‌కు ప్రతి నెలా రూ.రెండు వేలు గౌరవ భత్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే కూలీల పెండింగ్ వేతనాలను కూడా చెల్లించాలని కోరారు. మేట్స్ గెద్దం దేవీ, కుసుమ రమేష్, వాతాడి వెంకటరమణ, అన్నవరం, కూలీలు పాల్గొన్నారు.

రాయితీపై పశువుల దాణా పంపిణీ



మొండెపులంకలో రైతులకు దాణా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: పాడి రైతులకు 50 శాతం రాయితీతో ప్రభుత్వం పశుదాణా అందిస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మొండెపులంకలో సోమవారం పలువురు పాడి రైతులకు రూ.1100 విలువైన పశు దాణాను 50 శాతం రాయితీతో రూ.550కు అందజేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ గుడాల రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి కిరణ్ చైతన్య, పశువైద్య సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సోంపల్లి డ్రెయిన్ పూడిక తీయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతులు

రాజోలు: సోంపల్లి డ్రెయిన్ పూడిక తీయాలని రాజోలుకు చెందిన రైతులు సోమవారం గ్రీవెన్స్‌సెల్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ ఎన్ఎస్ఎస్ ప్రసాద్‌కు సోంపల్లి డ్రెయిన్ పూడిక తీయకపోవడంతో పరిసర పంటపొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు వివరించారు. డ్రెయిన్‌లోని పెరిగిపోయిన గుర్రపుడెక్క తొలగించాలని విజ్ఞప్తి చేశారు. కొద్దిపాటి వర్షానికే డ్రెయిన్ ముంపు నీరు వెనక్కి ప్రవహించి పంటపొలాలను ముంచెత్తుతున్నాయన్నారు. రైతులు కుంపట్ల వెంకటేశ్వరరావు, గుబ్బల నరసింహస్వామి, మట్టా ఏడుకొండలు, మొల్లేటి సత్యనారాయణ, గుబ్బల బూరియ్య, కడలి సత్యనారాయణ, రాయుడు వనమయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాలను అడ్డుకున్న వీఆర్వో

అయినవిల్లి: మండలంలోని చింతనలంక పాటిరేవులో ఇసుక, మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. ఈ సమాచారం అందుకున్న గ్రామ వీఆర్వో గొల్లపల్లి సత్యనారాయణ ఘటన స్థలానికి చేరుకుని తవ్వకాలను అడ్డుకున్నారు. పొక్లెయినర్, ట్రాక్టర్లను అక్కడి నుంచి పంపించేశారు.